క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



కేసరపల్లి(గన్నవరం):మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీపీఎం ఆధ్వర్యంలో కాలనీలో సమస్యలపై సంతకాలు సేకరించి గ్రామసచివాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఎం. ఆంజనేయులు మాట్లాడుతూ వీఎన్. పురం కాలనీవాసులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. రాత్రి వేళలో వీధిలైట్లు వెలగడం లేదని, రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టి దిబ్బల వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా పైపులైన్ మరమ్మతులు గుర్తైన పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల ట్యాంకర్ రూ. 600 వరకు వెచ్చించి నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పార్టీ నేతలు సూరగాని సాంబశివరావు, మిరప నాగేశ్వరరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో తాగునీటి పైప్‌లైన్‌కు శనివారం మరమ్మతులు నిర్వహించారు. గ్రామంలో పలు చోట్ల తాగునీటి కుళాయిలు, పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో సురక్షిత తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంకులు, మోటారు బోర్ల సహాయంతో తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో పలు చోట్ల తాగునీటి కుళాయిలను కూడా మరమ్మతులు చేశామని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

సనత్‌నగర్‌లో ప్రహరీ తొలగింపు



పెనమలూరు:తాడిగడప మున్సిపాలిటీ అధికారులు కానూరు సనత్‌నగర్‌లో ఒక కంపెనీకి చెందిన గోడను శనివారం తొగించారు. కానూరు సనత్‌నగర్ నుంచి కానూరు ప్రధాన రహదారి మీదగా 100 అడుగుల రోడ్డుకు గతంలో ఉడా 80 అడుగుల రోడ్డును మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించింది. అయితే 80 అడుగుల రోడ్డు నేటివరకు కార్యరూపం దాల్చలేదు. గత 2014-2019 టీడీపీ పాలనలో 80 అడుగుల రోడ్డు వేస్తామని శంకుస్థాపనలు చేసి వదిలేశారు. ఇప్పుడు తాజాగా మరలా 80 అడుగుల రోడ్డు వేస్తామని ప్రకటించారు. ఇది ఆచరణలో జరుగుతుందా లేదో తెలియదుకాని సనత్‌నగర్ వద్ద ఒక కంపెనీకి చెందిన భారీ ప్రహరీని పొక్లెయిన్‌తో పడేశారు. గోడ తొలగింపునకు నోటీసు ఇచ్చామని, కంపెనీ యాజమాన్యం స్పందించటేదని కమిషనర్ నజీర్ తెలిపారు. అందుకే తామే గోడను తొలగించామని తెలిపారు.

డీపీఎస్‌లో ఆటల పోటీలు



రామవరప్పాడు:విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో శనివారం సంప్రదాయ వైబ్స్- విగర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్‌కెజీ నుంచి 8వ తరగతి విద్యార్థులకు సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు. ఏడు పెంకులు, బొంగరాల ఆట, గోళీలు, మూడు కాళ్ల పందెం, అష్టా చమ్మా, వైకుంఠపాళి, కర్ర బిళ్ల, తొక్కుడు బిళ్ల వంటి పలు రకాల ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ చిన్ననాటి సాంప్రదాయ ఆటలు గుర్తు చేసేందుకు విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పవన్‌చంద్, ప్రవీణ్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ట్రాఫిక్ ఔట్‌పోస్టులు!



గన్నవరం రోడ్డు కూడలిలో శిథిలావస్థకు చేరువలో ట్రాఫిక్ అవుట్ పోస్టు



బస్టాండు కూడలిలో అధ్వానంగా మారిన ట్రాఫిక్ అవుట్ పోస్టు



కంకిపాడు బైపాస్ మార్గంలో డివైడరు మధ్యన నిరుపయోగంగా ఉంచిన ట్రాఫిక్ అవుట్ పోస్టు

- నిర్వహణ లోపంతో అధ్వానంగా మారిన వైనం
- రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నెలవు
- పట్టించుకోని పోలీసులు

కంకిపాడు: పోలీసు సిబ్బంది విధి నిర్వహణకు ఉపయుక్తంగా ఏర్పాటుచేసిన ట్రాఫిక్ అవుట్ పోస్టులు అలంకారప్రాయంగా మారాయి. పోలీసుశాఖ పర్యవేక్షణ, నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా తయారయ్యాయి. రాత్రిళ్లు ఈ అవుట్ పోస్టులు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. ట్రాఫిక్ అవుట్ పోస్టులు వినియోగంలో లేకపోవటంతో సిబ్బంది రోడ్లపై నిలబడి విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

సిబ్బంది కోసం...

రోడ్లపై పోలీసు శాఖ సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ విధులు నిర్వహించాల్సి వచ్చేది. ఈ సమస్యను అధిగమించేందుకు అత్యవసర వేళ రోడ్లపై విధులు నిర్వహించినా మిగిలిన వేళల్లో ట్రాఫిక్ అవుట్ పోస్టు కేంద్రంగా విధులు నిర్వహించేలా నిర్ణయించారు. సుమారు దశాబ్దం క్రితం గన్నవరం సర్కిల్‌గా ఉండగానే ప్రధాన కూడల్లో పోలీసు ట్రాఫిక్ అవుట్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇందుకు పలువురు దాతలు కూడా సహాయ సహకారాలను అందించారు. ప్రస్తుతం ఈ ట్రాఫిక్ అవుట్ పోస్టులు అలంకార ప్రాయంగా మారాయి. పోలీసుశాఖ పర్యవేక్షణ, నిర్వహణా లోపాల కారణంగా ఉపయోగంలో లేకుండా పోయాయి. కనీసం పోలీసు సిబ్బంది అడపా దడపా అయినా విధులు నిర్వహించుకునే ప్రదేశాల్లో లేకుండా వదిలేశారు. దీంతో అవి కాస్తా నిరుపయోగంగా తయారయ్యాయి. ఏళ్ల గడిచే కొద్దీ ట్రాఫిక్ అవుట్ పోస్టులు శిథిలావస్థకు చేరుతుండటం గమనార్హం.



ఈడుపుగల్లు సెంటరులో ప్రకటనకు పరిమితం అవుతున్న ట్రాఫిక్ అవుట్ పోస్టు

మందుబాబులకు అడ్డాగా....

అక్కడితో ఆగకుండా అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. ప్రత్యేకించి రాత్రిళ్లు మందుబాబులు, ఆకతాయిలు ఈ ట్రాఫిక్ అవుట్ పోస్టుల్లోనే తిష్ట వేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అయినా పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూడకుండా, నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు శాఖ స్పందించి ట్రాఫిక్ అవుట్ పోస్టులను వినియోగంలోకి తెస్తే ప్రధాన కూడళ్లలో విధులు నిర్వహించే సిబ్బందికి ఉపయోగపడతాయని పలువురు సూచిస్తున్నారు.

బార్ టెండర్లు 'సెట్' చేశారు

పెనమలూరు:తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో బార్ల టెండర్లు సెట్ చేశారు. తొలుత టెండర్లు వేయటానికి వ్యాపారులు ఆసక్తి చూపకపోవటంతో సంబంధిత శాఖ అధికారుల చొరవతో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. జనరల్ క్యాటగిరీ కింద 14 మద్యం షాపులు (బార్‌లు) బీసీ క్యాటగిరీ కింద 2 చొప్పున ప్రభుత్వం మంజూరు చేసి నోటిఫికేషన్ ఇచ్చింది. ఒక్కో బార్‌కు కనీసం నలుగు దరఖాస్తులు ఉండాలని నిబంధనలు పెట్టింది. దరఖాస్తు రుసుం రూ.5 లక్షలుగా నిర్ణయించారు. అంటే బార్‌కు 4 దరఖాస్తులకు రూ. 20 లక్షలు చెల్లించాలి. దీంతో వ్యాపారులు ఆసక్తి చూపలేదు. ఎక్సైజ్ శాఖ పై ప్రభుత్వం ఒత్తిళ్లు పెరగటంతో మద్యం వ్యాపారులకు నచ్చచెప్పారని సమాచారం. దీంతో వ్యాపారులు సిండికేట్ అయ్యి జనరల్ క్యాటగిరీలో ఉన్న 13 షాపులకు బొటాబొటిగా నాలుగు దరఖాస్తులు చొప్పున టెండర్లు వేశారు. షాపుకు దరఖాస్తుల రుసుము రూ.20 లక్షలు చొప్పున 13 షాపులకు రూ కోటి పైన దరఖాస్తు రుసుము అధికారులు రాబట్టారు. ఒక షాపునకు ఒక్క దరఖాస్తు మాత్రమే రావటంతో లైసెన్స్ ఇవ్వలేదు. బీసీ క్యాటగిరీకి ఉన్న రెండు షాపులకు మాత్రం 24 దరఖాస్తులు వచ్చాయి. జనరల్ క్యాటగిరీలో 13 షాపులకు 52 దరఖాస్తులే రావటం విశేషం. బార్‌లు కొత్తగా ప్రారంభిస్తున్నందున వైన్స్ షాపులను అధికారులు నియంత్రిస్తారా లేదా అనే ప్రశ్న తలెత్తుతుంది. పర్మిట్‌రూమ్‌లు లేకుండానే వైన్ షాపులు మద్యం సేవించటానికి యజమానులు ఏర్పాట్లు చేశారు. మద్యం ప్రియులు వైన్స్ షాపుల వద్దే మద్యం సేవించి అక్కడే పడిపోతున్నారు. ఇది ఇలానే కొనసాగితే భవిష్యత్తులో బార్ యజమానులకు, వైన్స్ షాపు యజమానులకు పోరు జరిగే అవకాశం ఉంది.

స్మార్ట్ రేషన్‌కార్డుల కోసం పడిగాపులు

పెనమలూరు:రేషన్ షాపుల్లో మెరుగైన సేవలు అందించటానికి స్మార్ట్ రేషన్‌కార్డులు తీసుకొచ్చామని ప్రభుత్వం ప్రకటించినా నేటికీ కార్డు దారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు అందలేదు. మంత్రి నాదెండ్ల మనోహర్ పోరంకి గ్రామానికి వచ్చి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీని గత కొద్ది రోజుల క్రితం ప్రారంభించారు. స్మార్ట్ రేషన్‌కార్డులు సిబ్బంది ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తామని మంత్రి ప్రకటించారు. అయితే స్మార్ట్ రేషన్‌కార్డులు ఇళ్లకు వచ్చి ఎవ్వరూ ఇవ్వటం లేదు. దీంతో కార్డు దారులు సచివాలయాలు, రేషన్ షాపుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. కార్డులు సక్రమంగా పంపిణీ చేయించటానికి ఒక్క అధికారి కూడా చర్యలు తీసుకోవటం లేదు. ఇప్పటికైనా తమకు స్మార్ట్ రేషన్‌కార్డులు అందచేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



పోరంకిలో రేషన్ షాపుల వద్ద కార్డు కోసం పడిగాపులు కాస్తున్న కార్డు దారులు

నీటి సంరక్షణ ప్రణాళికపై శిక్షణ

పెనమలూరు:నీటి సంరక్షణ ప్రణాళికపై శిక్షణలో భాగంగా పెదపులిపాక గ్రామంలో నీటి సరఫరా నిర్వహణను పరిశీలించటానికి అధికారులు బృందం శనివారం పర్యటించింది. కానూరులోని ఏపీఎస్ఐఆర్‌డీ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా జిల్లాలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీఈ స్థాయి అధికారులు పెదపులిపాక గ్రామ పంచాయతీకి వచ్చారు. వోహెచ్ఎస్ఆర్ నిర్వహణ, నీటి వనరుల లభ్యత, నీటి పంపిణీ, సీపీ డబ్ల్యూఎస్ స్కీమ్, పారిశుద్ధ్య నిర్వహణ, ఇలా పలు స్కీమ్‌లు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామంలో కృష్ణా జలాలు వివిధ గ్రామాలకు జరుగుతున్న సరఫరా ప్రాజెక్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుంటూరు శ్రీనివాసాచౌదరి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓగిరాల తిరుమల వెంకటరత్నం, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.



పెదపులిపాకలో కృష్ణా జలాల వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పుస్తక సంపదను వినియోగించుకోవాలి

గన్నవరం:గ్రంథాలయాల్లోని విలువైన పుస్తక సంపదను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రథమశ్రేణి గ్రంథాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావు పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో శనివారం గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని 50 మంది విద్యార్థినులకు గ్రంథాలయ శాశ్వత సభ్యత్వాన్ని రోటేరియన్ జాస్తి వెంకటకృష్ణారావు చెల్లించారు. ఈ సందర్భంగా నర్రా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ పుస్తకపఠనం అలవార్చుకోవాలని చెప్పారు. తద్వార విజ్ఞాన సముపార్జనతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఝాన్సీరాణి, రోటరీక్లబ్ అధ్యక్షులు జీవీ రవిబాబు, గ్రంథాలయాధికారి కె. నాగరాజు, రోటేరియన్లు గన్నె వెంకట్రావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న హెచ్ఎం

వైభవంగా గణేష్ నవరాత్రులు



కంకిపాడులో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు



అజ్జంపూడి అన్నసంతర్పణలో జెడ్పీటీసీ తదితరులు



కేసరపల్లిలో వినాయకుని పూజలో భక్తులు

కంకిపాడు: గణేష్ నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజైన శనివారం విఘ్నేశ్వరుడికి భక్తులు విశేషంగా పూజలు జరిపించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో దంపతులు పీటలపై కూర్చుని స్వామి వారికి పూజలు చేయించి నైవేద్యాలను ప్రసాదంగా సమర్పించారు. చలువ పందిళ్లలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కంకిపాడులోని సినిమాహాలు సెంటరులో ఏర్పాటు చేసిన చలువ పందిరి వద్ద భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కొనసాగుతున్న గణపతి ఉత్సవాలు

గన్నవరం:మండలంలోని అజ్జంపూడిలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న గణేష్ మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ప్రారంభించారు. అనంతరం గణనాథుడిని ఊరేగింపు తీసుకువెళ్లి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, బుద్దవరం గ్రామ ప్రముఖులు తాడిశెట్టి రంగారావు, నక్కా కృష్ణ, గండికోట గోవర్ధన్, ముద్రబోయిన వెంకటేశ్వరరావు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు. కేసరపల్లిలోని శివాలయం ఆవరణలో పలువురు దంపతులచే వినాయకునికి పూజలు నిర్వహించారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి విశేషపూజలు జరిపారు. రాయ్‌నగర్, గొడపేట, యాదవులపేట, అల్లాపురం, బుద్దవరంలో గణపతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

రవికిరణ్ కుటుంబ సభ్యులకు పరామర్శ



పెనమలూరు:చోడవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చోడవరపు రవికిరణ్ అనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన కుటుంబ సభ్యులను పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి శనివారం పరామర్శించారు. రవికిరణ్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. రవికిరణ్ కుటుంబ సభ్యులను పార్టీఅండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పోరంకిలో అన్నమారాధన

పెనమలూరు:పోరంకి గ్రామ దేవత గంగానమ్మ తల్లి గుడి వద్ద శనివారం పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా తొలుత స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివసతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మూడు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని వాహనం పై ఊరేగించి నిమజ్జనం చేశారు.

జమున నటన ఆదర్శం

విజయవాడ కల్చరల్: సినీ నటి జమున నటన భావి నటీమణులకు ఆదర్శమని రంగస్థల నటుడు లక్ష్మణరావు అన్నారు. కళాభారతి జమున కళాపీఠం, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం వేదికపై శనివారం జమున జయంతి కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ జమున తెలుగుతోపాటు తమిళం, కన్నడ సినిమాలలో నటించి ప్రతిభను చాటుకున్నారని చెప్పారు. కళా పోషకుడు డొక్కా సుబ్రహ్మణ్యం మాట్లాడారు.

మహిళలకు 8500 బస్సులు కేటాయింపు

పెనమలూరు:రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకం సక్సెస్ అయిందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. పెనమలూరు సెంటర్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉచిత బస్సు మొదలు పెట్టిన తరువాత నుంచి నేటి వరకు మహిళలకు రూ. 94.50 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. మొత్తం 10,500 బస్సులు ఉంటే మహిళలకు 8500 బస్సులు ఉచిత ప్రయాణానికి కేటాయించామని చెప్పారు. కొత్తగా 1350 విద్యుత్ బస్సులు బుక్ చేశామని తెలిపారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకం విజయవంతమయిందని తెలిపారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన కచేరీలు

విజయవాడ కల్చరల్: లయనాద కళా స్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా దుర్గాపురం శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కీర్తనలను సీహెచ్ లాస్య ప్రియ, జె. శ్రావణి, లంకా తేజస్విని మధురంగా ఆలపించారు.

కె. శ్రీకర్, శరవణ విశ్వనాథ్, కె.భార్గవ, గాయత్రి విభావరి, కె. అరవింద్ వాద్య సహకారం అందించారు. నిర్వాహకురాలు మాధవి మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేస్తూ యువ సంగీత కళాకారులకు వేదిక కల్పిస్తున్నామని వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు సాధ్యం కాదు

నున్న(విజయవాడరూరల్): పడమర రామాలయం ఎదురుగా డ్రెయిన్‌పై మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు సాధ్యం కాదని విద్యుత్‌శాఖ స్పష్టం చేసింది. గత సోమవారం ఢిల్లీ వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశకు డ్రెయినేజీపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయవద్దని వినతి పత్రం అందచేశారు. దీనిపై విచారణ జరిపి తక్షణమే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన డ్రెయిన్ పరిశీలించారు. అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నందున మరొకటి ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని తేల్చారు. నున్న గ్రామంలో లో ఓల్టేజి సమస్య లేదని ఏఈ శివారెడ్డి తెలిపారు.

నాణ్యమైన తాగునీరు సరఫరా చేయాలి

నున్న(విజయవాడరూరల్): గ్రామ ప్రజలకు నాణ్యమైన తాగునీటిని సరఫరా చేయాలని గ్రామీణ నీటి సరఫరా రిటైర్డ్ చీఫ్ ఇంజినీరు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు తోట ప్రభాకరరావు అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి రాష్ట్రంలోని వివిధ జిల్లాల సూపరింటెండెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల ట్రైనింగ్ అండ్ వర్క్‌షాపులో శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం నున్న గ్రామానికి అధికారులు బృందాలుగా వచ్చారు. నున్న గ్రామంలో సరఫరా చేస్తున్న తాగునీటిలో నాణ్యతను పరిశీలించిన ప్రభాకరరావు క్లోరినేషన్ లేకుండా ఇంత పెద్ద గ్రామంలో తాగునీటి సరఫరా చేస్తున్న విధానంపై అధికారులను ప్రశ్నించారు. సంప్ రిపేరులో ఉన్నందున క్లోరినేషన్ చేయడం లేదని అధికారుల సమాధానంపై ఆయన మండిపడ్డారు. క్లోరినేషన్ మంచినీటి ట్యాంక్‌ల్లో కలిపి సరఫరా చేయాలన్నారు. గ్రామంలో 22 మినీ ట్యాంక్‌లున్నాయని వాటి ద్వారా ప్రజలు నీటిని పట్టుకుంటున్నారని చెప్పిన సమాధానానికి ఆయన సంతృప్తిచెందలేదు. మురుగునీటిలో పైపులైన్ ఉండటంపై అధికారులను ప్రశ్నించారు. క్లోరినేషన్ లేకుండా మంచి నీటిని సరఫరా చేయరాదనే విషయాన్ని అధికారులు ఎందుకు గమనించలేదన్నారు. క్లోరినేషన్ చేయకపోతే ప్రజలు వ్యాధులబారిన పడే ప్రమాదం ఉందన్నారు. మూలనపడిన ఫిల్టర్‌బెడ్స్‌ను పరిశీలించి ఎంత కాలం నుంచి ఈ విధంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఓహెచ్ఎస్ఆర్, మినీ ట్యాంక్‌లను పరిశీలించారు. బరియల్ గ్రౌండ్ వద్ద ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ రెయిలింగ్ విరిగిపోవడాన్ని గమనించిన ఆయన ఎందుకు దాన్ని రిపేరు చేయించలేదని ప్రశ్నించారు. గ్రామ సర్పంచ్ కాటూరి సరళ, ఉపసర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు తోట ప్రభాకరరావు

విద్యార్థుల పురోభివృద్ధికి కృషి

పాఠశాల విద్య ఆర్జేడీ నాగమణి

నున్న(విజయవాడరూరల్): విద్యార్థుల వ్యక్తిగత మానసిక, శారీరక పురోభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయుల కృషి ఎంతైనా అవసరమని రాష్ట్ర పాఠశాల విద్యా ప్రాంతీయ (కాకినాడ) సంచాలకులు జి.నాగమణి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌జేడీ నాగమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి చిన్ని విషయానికి మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎంతటి సమస్యనైనా ఎదుర్కొనే మానసిక స్థైర్యం అవసరమని అది వ్యాయామ ఉపాధ్యాయుల వల్లే సాధ్యమవుతుందని చెప్పారు. అన్ని ఒత్తిళ్ళను అధిగమించడానికి వ్యాయామం, ఆటల వల్లే సాధ్యమని తెలిపారు. పాఠశాలల్లో వ్యాయామం క్రీడలు తప్పనిసరిగా జరిగేలా వ్యాయామ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఆటలు ఆడేలాగా వ్యాయామ ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కోరారు. స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు ఎన్టీఆర్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం ఎంతో గర్వకారణమన్నారు. గత మూడేళ్ళ నుంచి ఈ అవార్డు ఎన్టీఆర్ జిల్లాకు రావడం హర్షణీయమన్నారు. ప్రథమస్థానం సాధించిన నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రవిప్రసాద్, టి.శ్రీలత, టి.విజయవర్మను సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో హైస్కూల్ రిటైర్డు హెచ్‌ఎం వి.భూపాల్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ గద్దం కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్కూ ల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు